# కలియుగాంతం

## –చిత్తూరి కోటేశ్వరరావు

1997 వెళ్ళిపోయింది...1998 వచ్చింది.

కానీ, ప్రజలు ఎంతో ఉత్సాహంగా క్రొత్త సంవత్సర వేడుకలు జరుపుకోవడం లేదు. కారణం...త్వరలోనే కలియుగం అంతమైపోతున్నదనే నిజం ఎవరినీ నిలువనీయడం లేదు..మూడేళ్ళలోనే సర్వమూ హరించుకు పోతుందనే భవిష్య ప్రమాదం తెలియడంతో ఎవరిలోనూ ఆనందోత్సాహాలు కనిపించడం లేదు.

అందరి ఆలోచనలు నోస్టర్ డామస్..పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కాలజ్ఞానం మీదనే..దానికితోడు ఈ మధ్యకాలంలో విపరీతంగా జరుగుతున్న 'క్రీస్తు రెండవ రాకడ' అంటూ క్రైస్తవ ప్రచార సభల్లోనూ అదే ప్రస్తావన.

అయితే, కలియుగం అంతం కాబోతున్నదా?

అదే నిజమైతే ఈ మూడు సంవత్సరాల్లో సాధించేదేమిటి...జీవితంలో మిగిలినవన్నీ ఈ మూడేళ్ళలో అనుభవించడం ఎలా...చేయవలసిన పనులన్నీ చేయడం ఎలా? ఉన్న ఆస్తిపాస్తు లన్నింటినీ ఏం చేసుకోవాలి..ఎలా జాగ్రత్త చేసుకోవాలి..అన్న మీమాంసలో వున్నారే తప్ప ఎవరూ నూతన సంవత్సరపు వేడుకలు జరుపుకోవడం లేదు. కొందరి పెద్దవాళ్ళ ఆలోచనలు ఇలావుంటే..'హమ్మయ్య..ఇప్పటికే జీవితంలో అన్ని సుఖదుఃఖాలు చవిచూశాము..ఇక ఈ జీవితం చాలు..ఆ మూడేళ్ళు ఎంత త్వరగా గడిచిపోతే బాగుండు..త్వరగా ఈ జీవితాన్నుంచి విముక్తి లభిస్తుంది' అనుకునే వేదాంతులు మరికొంతమంది...

యువకుల విషయానికి వస్తే...

జీవితకాలంలో ఇన్నాళ్ళు అల్లరి చిల్లరగా తిరగడంతోనే సరిపోయింది. జీవించాల్సిన వయసు ఇప్పటినుంచే మొదలవుతుంటే...ఇంకెంతోకాలం జీవించి వుండలేమనే విషయం తెలియడంతో తట్టుకోలేకపోతున్నారు.

జీవితమంటే అర్థం తెలుసుకున్నదిప్పుడే.

అందం, ఆనందం...సుఖం, సంతోషం..బంధం, అనుబంధం...ప్రేమ, అనురాగం...ఇలాంటి అనుభూతులన్నీ సొంతం చేసుకోవాల్సిన ఈ తరుణంలో..తాము జీవించేది మూణ్ణాల ముచ్చటేనన్నట్టు మూడేళ్ళేనని తెలియడంతో యువతీయువకుల బాధ వర్ణనాతీతం..

జీవితసారాన్నంతా చవిచూసిన వృద్ధులు మూడేళ్ళేకాదు..మూడు నిమిషాలైనా, మూడు ఘడియలైనా కానీ మాకేం ఫరవాలేదనుకుంటుంటే.. ఇప్పుడిప్పుడే యవ్వనంతో ఉరకవేసే కుర్రకారు మాత్రం మూడేళ్ళకు కలియుగం అంతకావడానికి ఇష్టపడడం లేదు...అందుకే అందరిలోనూ ఒకటే ఆతృత...ఆరాటం...

ఆ ఆరాటం పోరాటమై...పడి లేచే కడలి తరంగంలా...ఒక ఉద్యమంలా పెరిగి వీధివీధినా యువత వీరంగం త్రొక్కుతున్న సమయంలో వారికి ఆపద్బాంధవునిలా గోచరించారు సుఖానందులవారు..

యువకిశోరాల ప్రార్థనను శ్రద్ధగా ఆలకించి తరుణోపాయాన్ని శెలవిచ్చారు. ప్రారంభమైంది మహా యజ్ఞానికి అంకురార్పణ.

ఒక ప్రయివేట్ టి.వి ఛానెల్లో స్వామీజీ ప్రసంగం ఇలా సాగింది.

''మిత్రులారా..మూడేళ్ళలో యుగాంతం రాబోతున్నది. ఈ జీవితంలో ఏం అనుభవించారో ఒక్కసారి గుర్తుకు తెచ్చుకోండి..నిండు నూరేళ్ళ జీవితంలో చివరగా మనకు మిగిలింది ఈ మూడేళ్ళు మాత్రమే. టైమ్ మేనేజ్‌మెంట్ థియరీ ప్రకారంగా నూరేళ్ళ జీవితంలో మిగిలేది మూడు సంవత్సరాలే. ఆ మూడేళ్ళు కూడా ఇప్పుడు పుడుతున్నటువంటి మన సంతానానికి మిగిలే అవకాశం లేదు. ఇంకో మూడేళ్ళకే ఈ యుగం అంతం అయిపోతే వాళ్ళు అనుభవించడానికి ఇంకేం మిగులుతుంది? ఏం చేస్తారు? ఏం చేయగలరు? ఏం సాధించగలరో మీరే ఆలోచించండి...

''అందుకే..జరిగిపోయిన కాలంతో మనకు పనిలేదు. జరిగేది, జరగబోయేది మాత్రమే మనకు కావాలి. అల్పాయుష్షు జీవితం మనకొద్దు..ఏదయినా తలపెట్టిన కార్యం పూర్తికావాలి. అసంపూర్ణమైన క్రియ వృధా... అందుకే మీరందరూ త్వరపడండి. మా ఉత్సవంలో చేరండి...

అంతంకానిది ఆరంభం మాత్రమే...నేటి నుంచే మీరందరూ మా యజ్ఞంలో పాలు పంచుకోండి. మా ఆశయమేమిటో మీకు ముందుగా చెబితే బాగుండదు. చేరిన తరువాత మీరే తెలుసుకుంటారు. ఓస్ ఇంతేనా అని అపహాస్యం చేయకండి..తరువాత విచారించడానికి కూడా మీరుండరు. ఆలస్యం అమృతం విషం అన్నారు పెద్దలు. అన్నీ అనుభవించినవాడు ఎన్నెన్నో చెబుతాడు. అందులోని సత్యం, అసత్యం ఎంత? మీరే ఆలోచన చేయండి...ఈ కార్యక్రమమంతా యువతదే''

స్పందన...ప్రజల్లో ప్రతిస్పందన...

ఎక్కడ చూసినా, ఎటు చూసినా..ఎవరినోట విన్నా స్వామీజీ పలుకులే.

చిన్నా పెద్దా తారతమ్యం లేదు...ఆడ, మగ విచక్షణ లేదు..ముసలీ, ముతకా అనే వయోభేదం...లేదు. అందరూ తలపెట్టిన మహాయజ్ఞం గురించే చర్చించుకుంటున్నారు.

★★★

సాయంత్రం ఆరుగంటలు..

నగరంలో జరిగే ప్రెస్‌మీట్‌లో స్వామీజీ ఏం మాట్లాడతారన్న ఉత్కంఠే అందరిలోనూ నెలకొని వుంది.

ఈ ప్రెస్‌మీట్ గురించి, స్వామీజీ ఫోటోలతో పెద్ద పెద్ద వాల్ పోస్టర్లు ముందుగానే అన్నిచోట్లా దర్శనమిచ్చాయి.

''స్వామీజీ ఇంతకూ మీ ఉద్దేశం ఏమిటి?''

''యువతను ఎందుకిలా ఉవ్విళ్ళూరిస్తున్నారు?''

''కలియుగాంతాన్ని ఆపుతారా?''

''ఆపగలిగే శక్తి మీకున్నదా?''

ఎందరో పాత్రికేయులు ఎన్నో ప్రశ్నలు....

వీటన్నింటికీ సుఖానందస్వామి ఒకే ఒక సమాధానం ఇచ్చారు.

''ఏదైనా ఒక పనిని తలపెట్టేటప్పుడు పూర్వాపరాలు ఆలోచించకుండానే శక్తి సామర్థ్యాలు లేకుండానే ఎలా తలపడతాననుకుంటున్నారు..ఏం జరుగుతుందో మీరే చూస్తారుగా...''

ప్రెస్ కాన్ఫరెన్స్ ముగిసింది.

ప్రయివేట్ టి.వి ఛానెల్ ఒకటి స్వామీజీ ఇంటర్వ్యూను ప్రసారం చేసింది.

విన్నవారంతా ముగ్ధులయ్యారు.

ఏనోట విన్నా స్వామీజీ పలుకులే...

ఆ క్షణం నుంచీ స్వామీజీకి భారీగా విరాళాలొచ్చిపడ్డాయి.

కృష్ణానది ఒడ్డున మహాయజ్ఞానికి ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. వేలాది ప్రజల వేల కిలోల నూనె, లారీల గంధపు చెక్క ఎంతో భక్తితో, ఉచితంగా తెచ్చి ఇస్తున్నారు.

ఆ యజ్ఞంలోని ప్రత్యేకత ఏమిటంటే యాగంలో



పాల్గొనే వారందరూ యువతీ యువకులే. వాళ్ళచేత వేద పండితులు మంత్రాన్ని ఉచ్చరింప జేస్తున్నారు. హోమం జరిగిపోతూనే వుంది. అక్కడ గుమికూడిన జనసందోహం ఎలాంటి పోలీసుల రక్షణ లేకుండానే నిశ్శబ్దంగా, ప్రశాంతంగా ఎవరి పనుల్లో వారు స్వామీజీ ఆదేశాల ప్రకారంగా చేసుకుపోతున్నారు.

స్వామీజీ యజ్ఞక్రతువు జరిగే చోటుకు వచ్చారు.

ఆయన అందరూ ఊహిస్తున్నట్టు ఇతర స్వామీజీల మాదిరిగ లేరు. ఎలాంటి అలంకరణలు లేకుండా సామాన్య మానవునిలా వున్నాడు.

యజ్ఞవాటికలోకొచ్చి కూర్చున్నాడాయన.

ఆ యజ్ఞంలోని యువతీ యువతుల మంత్రోచ్చారణ తప్పితే ఎలాంటి శబ్దాలు వినిపించడం లేదక్కడ.

అన్ని ప్రయివేట్ టి.వి ఛానళ్ళు, రిపోర్టర్లు, పాత్రికేయులు..దేశ విదేశాల ప్రతినిధులు ఆ కార్యక్రమాన్నంతా కవర్ చేస్తున్నారు.

★★★

అది వైకుంఠం...

శేషతల్ప పాన్పుపై పవ్వళించివున్నాడు శ్రీ మహావిష్ణువు.

''స్వామీ...నాదర మహర్షి మీకోసం వేచివున్నాడు. మీరు మాట్లాడుతూ మాట్లాడుతూనే నిద్రపోతుంటారు: అసలు మీరు నిద్ర ఎప్పుడు పోతారో, మీ నిద్రకు కారణం ఏమిటో నాకు అర్థం కాకుండా వుంది స్వామీ..పాపం నారదుడు ఎప్పటి నుంచి వేచివున్నాడో..ఎంతయినా మీ సతీమణిని కదా..నారదుడితో మాట్లాడడం మీ కిష్టం లేదేమో , అందుకే కావాలనే గురకపెట్టి నిద్రపోతున్నా రనుకుంటున్నాను...''

విష్ణుమూర్తి కళ్ళు తెరిచాడు.

''ఇంతకూ నారదుడు వున్నాడో..వెళ్ళిపోయాడో''

''ఇక్కడే వున్నాను స్వామీ''

''ఆ...నారదా..రా..రా''

నారదుడు ఏదో చెప్పాలనే ప్రయత్నం చేశాడు కానీ గట్టిగా ఆవలించాడు.

''అదేం నారదా..ఏదో చెప్పాలని నిద్రలోకి జారుకుంటున్నావు'' అన్నది లక్ష్మీదేవి ఛలోక్తిగా.

''భూ..లోకంలో దోమల బాధ ఎక్కువై భూలోకం నుంచి జెట్ లాగా వైకుంఠానికి వచ్చేసరికి కొంచెం నిద్ర ముంచుకొస్తోంది. అంతకన్నా మరేమీ లేదు..ఎంతయినా భూలోకం నుంచి వచ్చితిని కదా..అక్కడి విశేషములు ఒక్కసారి మీ చెవిన వేద్దామని''

''సెలవియ్యి నారదా'' చిరునవ్వుతో అన్నాడు మహావిష్ణువు.

''మహాప్రభో..నేను 1997 డిశెంబర్ 31వ తేదీ రాత్రి భూలోకానికి వెళ్ళాను. అందునా భారతదేశంలో..అక్కడి ప్రజలందరు చాలా దుఃఖంతో వున్నారు. దేశం మొత్తం భయాందోళనలతో బిక్కు బిక్కుమంటూ బ్రతుకుతున్నారు. కారణం ఏమిటో విచారించగా ఎవరో కొందరు మహానుభావులు జోస్యం చెప్పారుట...''

''ఏమని నారదా..''

''కలియుగాంతం అతి సమీపంలో వున్నదని చెప్పారట. నివారణోపాయం కొరకు కృష్ణానదీ తీరమున సుఖానందస్వామి ఆధ్వర్యంలో తమరికోసం బ్రహ్మాండమైన యజ్ఞం చేయుచున్నారు.''

''అందుకేనా ఆ మంటలు..పొగలు'' అంది లక్ష్మీదేవి.

''భూలోకమంతా వరుణదేవుని దయవలన కాలం కాని కాలంలో వచ్చే తుఫానుల తాకిడిదెబ్బకు సూర్యభగవానుడు ఇంట్లోనుంచి బయటకే రావడం లేదు. అగ్నిదేవుడు ఎక్కడున్నాడో ఎవరికీ తెలియడం

లేదు. అది సరే నారదా..ఆ యజ్ఞం సంగతి అలావుంది. ఈమధ్యకాలంలో భూలోక వాసులెవ్వరు నన్ను గురించి పట్టించుకోవడం లేదు. నన్నెందుకు మరిచిపోయారు..''

విష్ణుమూర్తితో నారదుడు ఏదో చెప్పబోతుంటే...

''ఇంకొంచెం సేపు నిద్రపోండి స్వామీ..ఇంకా ప్రజలు మిమ్మల్ని బాగా గుర్తుంచుకుంటారు'' వ్యంగ్యంగా నవ్వుతూ అన్నది లక్ష్మీదేవి.

''నేను చెప్పింది విని కోపగించుకోరు కదా..''

''కోపమెందుకు నారదా...నిజమే చెప్పాలి సుమా''

''స్వామీ..భూలోకంలో మిమ్మల్ని పూర్తిగా విస్మరించడానికి ఒక కారణం వుంది. ప్రతి ఊరిలోనూ ఎవరో ఒకరు స్వామీజీ..బాబా..ఫకీర్.. మహర్షి..యోగి ఇలా అనేక రకాల పేర్లతో ఆశ్రమాలు, మందిరాలు, తోటలు, భవనాలు నిర్మించుకుని తామే దైవాంశ సంభూతులుగా..అంటే మీ అంశ అన్నమాట...మహిమలను చూపిస్తూ కామధేనువు, కల్పవృక్షం లాంటివి ఏమీ లేకుండానే, విభూతి, కుంకుమ, శివలింగాలు, బంగారు ఆభరణాలను గాలిలోనుంచి సృష్టించి ఇస్తుంటే ఇంకా మిమ్మల్ని ఎవరు తలుచుకుంటారు, గుర్తుంచుకుంటారు స్వామీ..''

''నిజమా నారదా..''

''అవును స్వామీ..ప్రజలందరూ వారి మాయలను, ప్రలోభాలను కాంచింది, వారు కూడా వారి జీవన విధానాలను మార్చుకుని ఆ స్వాములకు అడుగులకు మడుగులొత్తుతూ వారు చెప్పే త్రికరణ శుద్ధిలేని వాక్కులను గుడ్డిగా నమ్ముతున్నట్లు నటిస్తూ కాలం వెళ్ళబుచ్చుతున్నారు. ఈ మధ్యకాలంలో ఒక ఆశ్రమంలో ఒక పెద్ద తుఫాను వస్తే మరో నిలయంలో స్వామీజీ ఉనికికే ముప్పు వాటిల్లినదట...ఇలా చెప్పుకుంటూ పోతే...ఎన్నో వున్నాయి మహాప్రభో..''

''నారదులవారు చెప్పింది నిజమే నాథా..నేనూ వినివున్నాను..'' లక్ష్మీదేవి వంత పాడింది. మహావిష్ణువు మౌనముద్ర దాల్చాడు.

''మీరు వెలసిన తిరుమల క్షేత్రంలో భక్తకోటి నిరంతరమూ దర్శించుకు వెళుతున్నప్పటికీ మీకు పోటీగా అయ్యప్పస్వామిని కొలవడం మొదలెట్టారు. మకర సంక్రాంతి నాడు ఎటు చూసినా నల్లబట్టల వాళ్ళే..ఒక విధంగా మీరు వాటిని నల్ల జండాలుగా భావించవచ్చేమో..ఇలా వుంది భూప్రపంచం...అందరినీ భరిస్తూనే వుంది ఆ భూదేవి మహాతల్లి'' చెప్పుకుపోతున్నాడు నారదుడు.

''ఇంతకూ..ఆ యజ్ఞం మాటేమిటి?'' గుర్తుచేసింది లక్ష్మీదేవి.

''యజ్ఞం మొదలై పదిరోజులైంది. పట్టినపట్టు వదలకుండా యువతీ యువకులు మహోధృతంగా యజ్ఞం చేస్తున్నారు. వాళ్ళను నిరుత్సాహ పరచకండి స్వామీ..'' నారదుని వేడికోలు..

''స్వామీ మీరు ఈ సమయంలో కూడా వెళ్ళకపోతే మిమ్మల్ని పూర్తిగా మరచిపోయే ప్రమాదం వుంది..''

లక్ష్మీదేవి హెచ్చరించడంతో నారదుని వెంట బెట్టుకుని భూలోకానికి పయనమయ్యాడు శ్రీ మహావిష్ణువు.

★★★

మూడురోజుల్లో పూర్తి అవుతుందనుకున్న యజ్ఞం పదిహేను రోజులు పట్టింది.

'కష్టేఫలి' అన్నట్టు అప్పుడు ఆ యజ్ఞవాటికలో ప్రత్యక్షమయ్యాడు శ్రీమహావిష్ణువు.

''మీ నిరంతర కృషికి నేను చాలా సంతసించితిని..అసలు మీరేల ఈ యజ్ఞం చేయబూనినారు..?''

అయినా, వాళ్ళెవరూ మహావిష్ణువు మాటలను పట్టించుకోలేదు.

అసలు శ్రీమహావిష్ణువు ఏవిధంగా వుంటాడో తెలియని ఆ యువత ఈమధ్య సినిమాలలో ఎక్కువగా యమధర్మరాజును చూస్తూ వుండడం ఒక కారణం అయితే..అడపాదడపా నందమూరి వారి పాత సినిమాలు చూసి శ్రీమహావిష్ణువు ఆ రూపంలానే వుంటాడని ఊహించుకోవడం మరో కారణం.. అదీ గాకపోతే, ఏ బాబాగానో, స్వామీజీగానో వుంటాడని అనుకున్నవాళ్ళకు, అక్కడ ప్రత్యక్షమైన విష్ణువు సాధారణమైన రూపంలో వుండడం వలన నమ్మశక్యం కాలేదు.

వాళ్ళ సందిగ్ధాన్ని గమనించిన నారదమహర్షి ఆ యువతకు విష్ణువును పరిచయం చేయగా..అప్పుడు నమ్మి 'హాయ్..హల్లో..హౌఆర్ యూ' అంటూ ఛీర్స్ చెప్పారు.

కరచాలనముల తరువాత అసలు విషయానికి వచ్చారు.

శ్రీ మహావిష్ణువు వారి విన్నపములన్నింటినీ ఓర్పుగా విన్నాడు.

''సరే..మీరు చెప్పినది నాకునూ సబబుగానే తోచుచున్నది. అందులకే ఈ విషయమై సమగ్రంగా విచారణ జరిపి ఒక నివేదికను సమర్పించిన ఎడల తగిన చర్య తీసుకుని మీకు న్యాయం చేస్తాను.''

యువతకు హామీ ఇచ్చి విష్ణుమూర్తి అంతర్ధానమయ్యాడు.

★★★

ఎన్నో తర్జన భర్జనలు జరిగాక...

దుర్వాస మహాముని ఆధ్వర్యంలో ఆరుగురుని భూలోకానికి వెళ్ళవలసిందిగా ఆదేశించాడు విష్ణుమూర్తి.

చీటికీ మాటికీ ఎవరినీ కోపగించి శపించవద్దని ముందే ప్రత్యేకంగా దుర్వాస మహామునిని హెచ్చరించాడు విష్ణువు.

''అవశ్యం మహాప్రభో...కానీ భూలోకంలో దరిద్ర దేవత తాండవం చేస్తున్నదని నారదుడు ఇప్పుడే చెప్పాడు. మేము అక్కడ నివసించుటకు, ప్రయాణ ఖర్చులకు, ఇతర ఖర్చులకు ఇబ్బంది పడకుండా వుండాలంటే లక్ష్మీదేవి కటాక్షం వుండాలి మాకు''

అప్పుడే కోపాన్ని తగ్గించుకుని, అతి వినయంగా విన్నవించుకున్నాడు దుర్వాసమహర్షి.

''ఇంకో విషయం కూడా వుంది ప్రభూ..ఈ మధ్య భూలోకంలో లక్ష్మీపార్వతి సరస్వతుల ప్రతిరూపాలు ప్రతి స్త్రీలోనూ కనిపిస్తున్నాయి. ఎక్కడ చూసినా మహిళా ప్రభంజనమే. స్త్రీ శక్తి విజృంభణ పేరిట స్త్రీ జనోద్ధారణ ఉద్యమాలు, స్త్రీవాద రచనలు, మహిళా పోలీసు స్టేషన్లు ఒకటేమిటి...అన్నింటా మహిళలే ఉద్యమిస్తున్నారు. ఇలాంటప్పుడు తీరా భూలోకం వెళ్ళాక ఈ కమిటీలో మహిళకు ప్రాతినిధ్యం లేకపోతే అక్కడి మహిళలు దుర్వాస మహర్షిని ప్రశ్నలతో వేధించి ఆయనకు ముక్కుమీద కోపం తెప్పిస్తారేమో..'' అన్నాడు నారదుడు.

వాళ్ళ అభ్యర్థనను మన్నించాడు శ్రీమహావిష్ణువు.

దుర్వాస మహర్షి కమిటీ నేతృత్వంలో లక్ష్మీదేవి కూడా భూలోకానికి బయలుదేరింది.

శ్రీమహావిష్ణువు త్వరితగతి చర్యకు యజ్ఞంలో పాల్గొన్న ఉద్యమకారులంతా ఎంతో సంతోషించారు. వారు కూడా ఒక కమిటీగా ఏర్పడి దుర్వాస మహర్షితో రకరకాలుగా చర్చలు జరిపి వారిని పలురకాల విందు భోజనాలతో, విహార యాత్రలతో సంతృప్తిపరిచి తమ సమస్యలన్నింటినీ విన్నవించుకున్నారు.

కమిటీ సభ్యులంతా వైకుంఠానికి తిరిగి వెళ్ళారు.

మహావిష్ణువు సాన్నిధ్యంలో దుర్వాస మహర్షి తన అభిప్రాయాన్ని ఇలా వెల్లడించాడు-

''మహాప్రభూ..భూలోకవాసులు



చెప్పిందాన్లో తప్పేమీ లేదు. ఈ మధ్యకాలంలో యువత అనేక కష్టాలను భరించవలసివచ్చింది. ఎటు చూసినా నిరుద్యోగ సమస్యే..కష్టపడి చదివి పరీక్షలు రాసి కృతార్థులు అవుతామన్న నమ్మకం పోయింది. ప్రతి పరీక్షలోనూ ఏదో ఒక స్కామ్..ప్రతిచోటా ప్రయివేట్ పాఠశాలలు..కొన్ని పట్టణాలలో అయితే వీధికి రెండు చొప్పున వెలిశాయి...సరస్వతీ కటాక్షం కోసం లక్ష్మీదేవిని ఇష్టమొచ్చిన రీతిలో వీధిన పడేస్తున్నారు..

''వైద్య, ఇంజనీరింగ్, ఇతర సాంకేతిక కళాశాలల్లో నైపుణ్యత లోపించింది. విద్యార్థులంతా విదేశాలకు వలస వెళ్ళిపోతున్నారు. వాళ్ళంతా విదేశీ సంస్థలతో కలిసి దేశాన్ని క్లిష్ట పరిస్థితుల్లోకి నెట్టేస్తున్నారు. ఎక్కడ చూసినా మోసాలు, హవాలాలు, దాణా కుంభకోణాలు, యూరియా స్కామ్, భూకబ్జాలు, అధికార దుర్వినియోగం, ఆశ్రిత పక్షపాతం, అశ్లీలత తాండవిస్తున్నాయి..

''యువత తొంభైశాతం నిర్వీర్యంగా వుండి పదిశాతం మాత్రమే అన్ని సౌఖ్యాలూ అనుభవించ గలుగుతున్నారు. ఈమధ్య కులతత్వం బాగా ప్రాకిపో యింది. వర్గాలు మరిన్ని కష్టాలు తెచ్చిపెడుతున్నాయి. నిజంగా యువత 'హరీ'మంటోంది. రాజకీయ వాతావరణం మారిపోయింది. రౌడీలే రాజ్యమేలు తున్నారు. గత పదిహేను సంవత్సరాలుగా మానవుడు ఓటు హక్కుని సరైన పద్ధతిలో వినియోగించు కోవడం లేదు. అసలు ఎంతోమందికి ఓటు వేసే అవకాశమే రావడం లేదట..

''స్వతంత్ర్యత సమసిపోతుంది. స్వాతంత్ర్యానికి మళ్ళీ చరమగీతం పాడవలసి వస్తుంది. మళ్ళీ డబ్బున్న వాడిదే రాజ్యం రావచ్చు..మళ్ళీ ప్రయివేట్ కంపెనీలు, ప్రయివేట్ యాజమాన్యం..ఇక యువతకు దారేటు'' సుదీర్ఘమైన ప్రసంగాన్ని ఎంతో వినయంగా విన్నవించుకున్నాడాయన.

''స్వామీ...మహర్షులు అసలు విషయాన్ని విస్మరించారు. అసలు యజ్ఞం చేయడానికి కారణం ఏమిటి? తమకు అనుకూలంగా చెప్పమని దుర్వాసుల వారిని మానవులు రకరకాలుగా ప్రలోభాలు చూపించారు. అదీగాకుండా ఈ యజ్ఞాన్ని నిర్వహించిన యువతకు కొంతమంది ఇతరులతో విభేధాలుండి వారే మహర్షుల వారిని విహారాలకు తీసుకెళ్ళి తృప్తిపరిచారు'' అన్నది లక్ష్మీదేవి.

''అవును ప్రభూ..అసలు నన్నడి గితే కలియుగం పూర్తికాలం గడవ కుండానే మధ్యంతరంగా ముగింపు చేసి, ఆ మిగిలిన కాలాన్ని మీ చేతుల్లో పెట్టుకుంటే చాలా బాగుంటుంది'' తన అభిప్రాయాన్ని చెప్పాడు నారదుడు.

''దుర్వాసులవారు సమర్పించిన నివేదిక ఏకపక్షం గా వుంది కదా..ఇలాంటి చర్యకు ప్రజల నుంచి సరి యైన స్పందన లభిస్తుందా?'' విష్ణుమూర్తిసందేహం..

''అలా అయితే లక్ష్మీదేవిగారి అభిప్రాయం కూడా తీసుకుందాం. వారెవరూ అక్రమరీతిలో ప్రలోభపెట్టలేరు కదా..'' నారదుని ఛలోక్తి.

''భలేవాడివి నారద..ఆమే కదా ఇతరులను ప్రలోభపెట్టేది..ఆమెను ప్రలోభపెట్టే వారెవరుంటారు? ఆమె చెప్పినట్టే చేద్దాం'' లక్ష్మీదేవి వైపు చూస్తూ అన్నాడు విష్ణుమూర్తి. లక్ష్మీదేవి ఒక నిట్టూర్పు విడిచింది...కండ్ల నీరుబికింది..గొంతు గాద్గదికమైంది. దీనాతిదీనమైన చూపులతో చూసింది..విష్ణువుముఖంలో చిరునవ్వు...

''నారదుడు చెప్పినదాంట్లో ఎలాంటి అసత్యం లేదు ప్రభూ.. భూలోకవాసులు నన్ను ఏవిధంగా ఎన్ని అక్రమ మార్గాలలో ఎంతవరకు దుర్వినియోగం చేయవచ్చో అంతవరకు చేసేశారు. ఈ దుర్వినియోగాల్లో కూడా ఒక వర్గం మాత్రమే ఆనందడోలికల్లో వుంటే.. తొంభైశాతం యువత దుఃఖ సముద్రంలో మునిగి తేలుతున్నారు. వారి జీవితాలను అర్ధాంతరంగా ముగిస్తే వాళ్ళంతా నిశాచరులై యమలోకంలో అలజడి రేపవచ్చు'' ఒక క్షణం చెప్పటం ఆపింది లక్ష్మీదేవి.

''అవును ప్రభూ..యమధర్మరాజు, చిత్రగుప్తుడు ఈమధ్యకాలంలో తరచుగా భూలోకాన్ని సందర్శిస్తున్నారు..ఇక యమలోక బాధ్యతలు కూడా మీరే స్వీకరించవచ్చు'' అన్నాడు నారదుడు.

''స్వామీ..ఇకనైనా మీరు నిద్రమాని భూలోక పరిస్థితులు చక్కపెట్టండి. ఇప్పటికే కల్లోల కలుషితంగా వుండిపోయిన భూలోకాన్ని ఇలానే ఇంకొంతకాలం కొనసాగిస్తే దేశం మొత్తం కల్లోలిత ప్రాంతంగా ప్రకటించవచ్చు...

''శాంతం, భద్రతలు పోయి మీ ప్రమేయం లేకుండానే కలియుగం అంతం కావచ్చు. పాపం, ఏదీ అనుభవించని అమాయక యువత పరిస్థితిని సానుభూతితో సావధానంగా ఆలోచించి, కలియుగాంతాన్ని నివారించి ఇంకొక యాభై సంవత్సరాలు పొడిగించి సుస్థిరమైన, అసమానతలు లేని సాంఘిక జీవితాన్ని నెలకొల్పి, నన్నెప్పుడూ అక్రమ ప్రలోభాలకు గురిచేయకుండా..కాపాడవలసిన బాధ్యత మీమీదనే వుంది..'' ఇంకా చెబుతూనే వుంది లక్ష్మీదేవి.

చివరకు తన అభిప్రాయానికి విలువలేకుండా పోయినందుకు దుర్వాస మహర్షి ఖిన్నుడై నిలుచుండిపోయాడు.

''స్వామీ..మీ మిత్రుడు పరమేశ్వరుల వారికి కూడా ఒక సూచన చేయండి..''

''ఏమది దేవీ'' విష్ణుమూర్తి ముఖంలో ఆశ్చర్యం...

''భూలోకంలో గంగను సీసాలలో బంధించి అమ్ముతున్నారు. అసలు స్కామ్‌లన్నీ గంగమీదనే..చెప్పాలంటే ఎన్నని చెప్పమంటారు..నదీ జలాల వివాదల దగ్గరనుంచి...ప్రాజెక్టులన్నీ ప్రలోభాలకు లోనైనవే. ఆ గంగ కోసమే నన్ను బజారున పెట్టి అభాసుపాలు చేస్తున్నారు.''

చెప్పడానికి ఇంకేమీ లేదన్నట్టు ముగించింది లక్ష్మీదేవి.

విష్ణువు చిరునవ్వుతో అందరివైపూ చూశాడు.

''ఏం నారదా..నువ్వు చెప్పేది ఇంకేమైనా వుందా?''

''ఉంది స్వామీ..మన దేవేంద్రునికి దేవలోకంపై బొత్తిగా శ్రద్ధ తగ్గిపోయినట్టుంది. భూలోకంలో ఎక్కడ చూసినా దేవకన్యలే కనిపిస్తున్నారు. ప్రతి ఒక్కరూ రంభలు, మేనకలు, తిలోత్తమ, సౌందర్యలు కావడంతో డబ్బుకాసపడి వేలం పాట వేస్తున్నారు.''

విష్ణువు వదనంలో చిరునవ్వు చెరిగిపోలేదు.

అందరి అభిప్రాయాలూ, వాదనలు, పరిశీలన జరిపిన తరువాత విష్ణువు దీర్ఘంగా ఆలోచించాడు.

''ప్రస్తుతానికి కలియుగం అంతం కావడం లేదు..మరో పదేళ్ళు పొడిగిస్తున్నాను'' అన్నాడు శ్రీమహావిష్ణువు.

భూలోకంలో ఈ విషయం తెలియడంతో యువత ఆనందానికి అంతులేకుండా పోయింది.

కష్టపడకుండానే సంపాదించడమెలా..బలహీనుల్ని దోచుకుని బలవంతుడిగా మారడం ఎలా...లక్ష్మీపుత్రులు కావడానికి ఎన్ని అక్రమ మార్గాలు వున్నాయోనని ఆలోచించడం మొదలెట్టింది యువత.

వాళ్ళలో ఎందరు హర్షద్ మెహతాలు అవుతారో, ఎన్ని కుంభకోణాలు వెలుగుచూస్తాయో!

ఎప్పటిలానే భూమండలం అధర్మ జీవన మార్గాన భ్రమణించడం మొదలైంది!

★

